# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౧. సంచిక ౧.

కాకినాడ:—శనివారము, ౧౯, ఫిబ్రవరి, ౧౯౨౦. 19 1920

చందా సం॥ రు ౩. విడిసంచిక అ ౧.

## ఓమ్.

దయానిధీ! ఎన్నడు మాహృదయము గాఢముగా నీపై నిల్చును? ఎన్నడు అనన్యమనస్కులరమై మేము నిన్ను సేవింపగలము? ధనదేవత మాప్రేమ నంతయు దొంగిలించుకొని పోవుచున్నది. ఎన్నడు లక్ష్మీదేవి తన క్రీగంటిచూపులు మాపై ప్రసరింపజేయునాయని మేము ఎదురు చూచుచుందుము. నీకటాక్షవీక్షణములకై మేము ప్రతీక్షించునట్లు మాహృదయమును నీకు అర్పణచేయునట్లు దయచేయుము.

— —

బ్రతుక గోరుచో మరణము చెందుము:—

సార్థకమైన జీవితమును సాధింపవలచుచో మనము మరణమును ఆహ్వానింప వలయును. ఎట్టి మరణమును? అహంకారముయొక్క మరణమును, దురాశలయొక్క మరణమును తుచ్ఛవాసనల యొక్క మరణమును, ఇంద్రియ లోలత్వము యొక్క మరణమును, కీర్తి కాముకత్వము యొక్క మరణమును, అధికారవాంఛయొక్క మరణమును. వీని మరణమునుండి మనోహరమైన జీవసంచలనము ప్రారంభమగును. ఈశ్మశానవాటికయందు సుందరోద్యానము ఉద్భవించును. ఉత్తమ జీవనమును వరించుచో పలుమార్లు మరణయాతనకు సమ్మతింపవలయును.

— —

మానవుడు బ్రాహ్మణుడుగా గాని, పంచముడుగా ~~గాని~~ పుట్టుకచేతనే కాజాలడు; తన పనులవల్లనే బ్రాహ్మణుడుగను, పంచముడుగను అగుచున్నాడు.

(బుద్ధుడు.)

— —

## యథార్థభక్తుడు.

—:o:—

ఒకప్పుడు ఒక చందమునను ఇంకొకప్పుడు వేఱొక చందమునను వర్తించినచో దానికిని దీనికిని సరిపోవును. ఎవ్విధమునను పేరును పొందజాలవు. అటు భక్తుడవుగను విజయమును పొందవు. ఇటు లౌకికుడవుగాను ఖ్యాతికెక్కవు. అన్నిటిని సమానముగా కొనసాగింపనేరవు. కాన ఒక్కదానిలో సంపూర్ణజయమును బడయుటకై నీ యావచ్ఛక్తిని వినియోగింపుము. ఎంతులోనైనను ఎడతెగని ప్రయత్నమువలనను, విశేష ప్రయాసవలనను, ప్రాణమునంతయు ధారపోయుటవలనను సంపూర్ణవిజయము లభించును. సదుద్దేశముతోడను త్రికరశుద్ధితోడను శక్తివంచనలేకుండ పనిచేయుటకు నీవు సర్వదా సంసిద్ధుడవై యుండుము. కుమారా! అనేకవిషయములలో వేలుపెట్టుటచే ముఖ్యమైన విషయము నీదృష్టినుండి తఱచుగా దూరమై పోవుచున్నది. అంతటితో నీఉన్నతస్వభావముగూడ అదృశ్యమగుచున్నది. నిన్ను నీవే తెలిసికొనజాలనప్పుడు అన్యులు నిన్నెట్లు తెలిసికొనగలరు. నీచపలచిత్తమునకు ఏది ముమ్మొదట తోచిన దానినే చేపట్టుదువు. అందుకై అమూల్యములైన నీకాలమును బలమును ప్రాణమును సమస్తమును పాడుచేయుదువు. చెదరని విశ్వాసముతో పనిచేయువాడే భక్తుడు. ఇందుకు నిదర్శనము అతని అనుదిన ప్రవర్తనయే.

(మజుందారు.)

— —

# హిందూమత సిద్ధాంతము-పరమాత్మ.

—— o:o:o ——

[పి. సి. మజుందారు గారు.]

VI

హిందూమత సిద్ధాంతములన్నియు ఈశ్వర సందర్శన మొంది, స్వానుభవముల ద్వారానే రచింపబడినవని నిరూపింపబడినవి. ఈశ్వర ముఖసందర్శము గాంచి ఆనందించుట—యిత్యాది యితర మత గ్రంథములందొక వాగ్దానము వలె మాత్రమె సూచింపబడినది. కాని హిందూమత గ్రంథములందు స్వానుభవముగ చెప్పబడియున్నది. మన యింద్రియములు, మన తదితర శక్తులు అభివృద్ధి పొందిన కొలది పవిత్రత చెందిన కొలది మున్ముందర మన హృదయకవాటము ముంగట ఈశ్వరుడు తన పవిత్ర ప్రేమ స్వరూపములను నిరంతరము ప్రకాశింపజేయుచుండును. మన అంతర దృష్టి క్రమానుగతి తేజమును పొందుచుండును. మనము విశ్వాసకులైన యెడల ప్రతిమానవునియందును ఈశ్వరసమ్ముఖమును గాంచగలుగుదుము. మానవుడు ఆత్మ స్వరూపుడని కూడ తెలిసికొనును. ఈశ్వరుని చేతనవస్తువుగ ఎన్నటికిని చూడజాలము. ఈశ్వరుడు సర్వాంతర్యామి; సర్వాతీతుడు,

ఇహైవసన్తో ௨థవిద్మస్తద్వయం నచేదవేదిర్మహతి వినష్టిః । యఏతద్విదురమృతాస్తే భవన్తి అథేతరే దుఃఖమేవాపియన్తి ॥

ఐహికమునందుండగానే మనము బ్రహ్మమును తెలిసికొనుచున్నాము. తెలిసినవారలము గామేని మనకు మహద్వినాశము కలుగును. ఎవరు ఈబ్రహ్మమును తెలిసికొనియెదరో వారు నిత్యపదవి గలవారగుచున్నారు.

పరమాత్మను మూడుమార్గములద్వారా జూడనగును. అందు మొదటిది, తేజోవంతమగు జ్ఞానము. రెండవది ధ్యానప్రార్థన సమయములం దుద్భవించు భక్త్యుత్సాహములద్వార బయలువెడలు వాగ్ఝరులు. మూడవది పవిత్రమగు హృదయము. ఎవ్వరైతే హృదయములందు పవిత్రతకలిగియుందురో అట్టివారుధన్యులు. వారు ఈశ్వరుని గాంచగల్గుదురు. కొంతకొంత్రుండు మాత్రమె సర్వదా తనయందు, అఖిలభూతములందు ఈశ్వర దర్శనమును బొందగలడు. సర్వదా ఈశ్వర సందర్శనము బొందుట ధన్యులగుటయే; హృదయమును, జ్ఞానమును, యిచ్ఛను స్థిరమగు, అనంతమగు ఔన్నత్యము చెందునటుల చేసికొనుటయే. అట్టివారు ధన్యులు; వందనీయులు. మన ఆత్మకు మనముగావించెడు కార్యములకు, చేసెడు ప్రయత్నములకు, మనలో బుట్టు ఆశయముల కనుగుణ్యముగా పాటు పోటు నుండును; ఒకక్షణము మన హృత్పురమందు జ్ఞానోదయమగును. మరియొకక్షణమందు హృదయాకాశమందు కారుమబ్బులుపట్టి అంధకారావృతమగును. కాని ఆధ్యాత్మిక ప్రపంచమం దించుక ప్రవేశముకలవాడు తాను ఈశ్వరుని జూడగలను అని నమ్మిన ఈపై నుదాహరింపబడిన నేదో యొక మార్గముద్వారా ఈశ్వరదర్శనము బొందుచుండును. హైందవాభిప్రాయమును బట్టి జూడ భక్తాగ్రేసరులందరు పవిత్రజ్ఞానము, పవిత్ర ఉత్సాహము, పవిత్రస్వభావము అను త్రిచక్షువులద్వారా ఈశ్వరుని జూడగల్గుదురు. నిశ్చలభక్తుడు, నిర్మల హృదయుడు అగువాడు ఈత్రినేత్రములద్వారా భూత, వర్తమాన, భవిష్యత్తుకాలములందును, ఇహమందును పరమందును, ఊర్ధ్వమందును నధరమందును, అంతరబాహ్యములందును, ఇది అది అననేల అనంతకాలమందును అనంతాకాశములందును ఈశ్వరసాన్నిధ్యము మహదానందంబుతో ననుభవించుచుండును.

చ॥ స॥

—

# విషజ్వర చరిత్రము.

——:o:——

[శీరిపి ఆంజనేయులు గారు – తెనుగుపండితుడు.]

IV

౧౧ చికిత్స.

లక్షణముల గనుగొని చాలినంతత్వరలో నుచిత చికిత్స చేయనియెడల వ్యాధిపుట్టిన ౭౨ గంటలలోపల రోగి మరణించునని గొప్పవైద్యులు సెలవిచ్చియున్నారు. శుభ్రమైన గాలియు నుంచి వెలుతురును ధారాళముగా జొచ్చుటకు వీలుగల గదియందు రోగి నేకాంతముగా నుంచవలయును. ఉచిత సపర్యలు చేయుటకు దగిన పరిచారిక లొకరిద్దరు తప్ప రోగి పరుండిన గదియం దితరులు ప్రవేశింపరాదు. అందలి తలుపులను గిటికీలను నిరంతరము తెరచియుంచుట క్షేమకరము. వాయుశుద్ధికై గదియం దప్పుడప్పుడు, గుగ్గిలము, సాంబ్రాణి, పొగవేయుట ప్రశస్తము. రోగి యుపయోగించెడు పాత్రలను గుడ్డలను బ్రత్యేకముగా నునిచి తఱుచు వానిని శుభ్రముచేయుచుండవలయును. ఆరోగ్యవంతులు వాని నుపయోగింపరాదు, సలసలక్రాగెడు వేడి జలపాత్రను రోగిదగ్గఱ నునిచి యతని యుమ్మిని కఫమును నందులో నుమియించవలయును. రోగి స్వస్థత జెందుదనుక బరుండియే యుండవలయును. జీర్ణశక్తి బలపడుపఱకు జావ వంటి తేలిక యాహారము నాతని కీయ

డయును, వ్యాధి నెమ్మదించుటను బట్టి పది నేను దినములు పట్టును. అపిమ్మట గూడ లోజ్వరము, మనోభ్రమణము, ఉన్మాదచిహ్నములు కొన్నియుండి తగ్గిపోవును. నిద్రపట్టదు. ఆకలి తక్కువ. రోగి పూర్తిగా కోలుకొనుటకు చాలకాలము పట్టును.

## ౧౭. ఔషధములు.

ఈవ్యాధి కెట్టి యౌషధముపయోగింపవలసినదియు దెలియక ప్రారంభదశలో దేశీయవైద్యులలో నెక్కుండుప్రి నిష్ప్రయోజనమైనను, దరుపరి నుచితౌషధ ప్రక్రియల గనుంగొని, తాముమేలు గాంచి తమ్ములను బలుపుర నుపచరించిరి. అట్టి సోదరజనులు వారభావమున నాప్రకరణ భాగముల బట్టికామము ఖమున జాటియే యుండిరి. ఈసందర్భమున మేమును మా గ్రామమున కొన్నిప్రక్రియల నుపయోగించియుంటిమి. అందెక్కువ గుణమిచ్చినది యొక్కటిమాత్రమె. దానినీదిగువ జూపెదము. ఆప్రక్రియకు జేరక గాదనితర కషాయ ప్రకరణములలో నొకకొన్నిటిని సహిత ముదాహరించెదము.

౧ అక్కలకర్ర ౧ తు, సొంటి ౧ తు, మిరియములు ౪ తు, కిసమిసుతో తులసి ౨ తు, కస్తూరి కాంత ౨ తు, తమ్మలపాకు తొడిమల యీనెలు ౧ తు, చేర్చి నాలుగు (కొలత) సేరుల నీళ్ళుపోసి సగమిగురునట్లు చక్కగా కాచవలయును. పిమ్మట కషాయము వాడుట కుపకరించును. వీని నుదయ మధ్యాహ్న సాయంత్రములు మూడు పూటలును బూటకు రెండుతులములవంతున మూడు దినములు నీయవలయును. పదిసంవత్సరములకు లో బడిన వారికి, పూటకు తులము వంతున జాలును. భేది విస్తారముగా నుండినయెడల తేనె- వమనమగుచుండినచో బొంగిన యల్లపు రసమును గొలదిగా నను పానము నుపయోగింపవలయును. మలబద్ధకముగ నుండునెడల పట్టికషాయమునుమాత్రము భేదియగువఱకు గంటకొకపర్యాయము పై పరిమితి చొప్పున నీయవలయును. గోధుమజావగాని, వేచిన బియ్యపునూకగంజిగాని కొంచెముప్పు చేర్చి యీయవచ్చును. పులుసు తగులని కందిగింజల చారుతో నన్నము పెట్టవచ్చును.

౨ ,, మెలుగు రాచక వేచిన మిరియములు ౧ పలము పొడిచేసి, యందొక పలము ఉప్పుపొడిని జేర్చి, దానిమీద మూతవేసి యుంచి పిమ్మట నందులో ౧౪ సే, నీళ్ళుపోసి నాలుగవవంతు కషాయమగునట్లు చక్కగా మరగగాచి అరపలము కలకండ కలిపి భోజనమునకు బూర్వము నాలుగు గంటల కొక పర్యాయ మీయవలయును. పథ్యము— మజ్జిగ, పెరుగు, పనికిరావు. కాఫీ, గోధుమనూక, పాలు, మున్నగు ద్రవాహారముల జీర్ణశక్తిని గమనించి యీయదగును. ''

New India.

౩ ,, ౧౭ అవున్సుల నీళ్ళలో అరపిడికెడు మిరియాల ముక్కలు వేసి, చిన్నగ దరిగిన యొక వెల్లుల్లిపాయను జేర్చి, అరగంటసేపు మరిగించి యడికిగను గొంత పటిక బెల్లమును జేర్చి ౧౦ అవున్సులకు దిగువఱకు గాచి పిమ్మట వడియ కట్టవలయును. జ్వరమూచన కాన్పించినతోడనే దానిని భోజనానంతరము గాని కడుపు గాని పోతో గలిపి దినమునకు రెండుమూడు పర్యాయము లీయవలయును. పరిమితి ౧౪ లేక ౨ అవున్సులు. ''

Madras Times.

౪ ,, నేల వేము ౧ తు, నన్నసుగంధపాలవేళ్ళ చూర్ణము ౧ తు, సొంటి ౧ తు, మిరియాలు ౧ తు, ధనియాలు ౧ తు, వాము ౧ తు, ఉప్పు ౧ తు, పంచదార ౧ తు, ఈదినుసుల చూర్ణము రెండు రెట్లు నీళ్ళలో పోసి, సగమువఱకు మరగ కాచవలెను అప్పుడు వాడుటకు ఉపయోగపడును. ''

౫ ,, వేపపట్ట (బెరడు) ౩ తు, మిరియాలు ౧ తు, వాము ౧ తు, వీనిని కొలదిగా నలుగగొట్టి ౧ సేరు నీళ్లలో సాయంకాలము ౬ గం॥ కు నానవేసి ఉదయము ౬ గం॥ వఱకు నుంచి పిమ్మట సగము కషాయము దిగునట్లు మరగనిచ్చి వడపోసి యుంచవలెను. వ్యాధిరాకుండుటకు ఆరోగ్యవంతులును చిన్నవారును ౧ చిన్నగరిటెడు, ౫౦ ఏండ్ల లోపువారు ౨ గ, కషాయము పరుకోనబోవు నప్పుడు త్రాగవలెను. జ్వరము తగిలినవారు పైమోతాదుల ప్రకారము దినమునకు మూడుసారులు త్రాగవలెను. దగ్గుకూడ నున్నచో పెద్దవారికి సగముగరిటెడు పిల్లలకు నాలుగవవంతు తేనెను కషాయములో చేర్చి యీయవలెను. గర్భిణీస్త్రీలకు తేనెకూడదు. జ్వరమున్నవారు గోధుమనూకజావ (పాలలో పటికబెల్లము పొడిచేర్చి) గోధుమరొట్టె, పాలు, పుచ్చుకొనవలెను.

౬ ,, లైము జ్యూస్ సోడానుగాని. సొండల్ సిరపును నీళ్ళలో గలిపిగాని తీసికొనవలెను, '' ''యూకలిప్టసు ఆయిలును చిటికెడుపంచదారలో రెండుచుక్కలు పోసి ఉదయసాయంత్రములయందు పుచ్చుకొనిన వ్యాధిసోకదు. '' Andhrapatrika.

---

# స్వదేశి వ్యవసాయ సంఘ స్థాపన.

---:o:---

శేలంజిల్లా హోసూరు తాలుకయందు శ్రీయుత ఉద్దనపల్లి రామయ్యనాయుడుగారి ఆధిపత్యముక్రింద జరుపనుండు హోసూరు తాలుక స్వదేశి వ్యవసాయాభివృద్ధి సంఘము అను పేరున స్థాపింపబడినది. ఈసంఘమున నూతన వ్యవసాయ విషయములను వ్యవసాయదారులకు తెలియజేయుటయు, ఆవిధము నవలంబించి వ్యవసాయముచేసి పండించిన పంట పిమర్శించి మెచ్చొందినవారలకు తగు రీత్యా బహుమానములిచ్చి ప్రోత్సాహింపబడును. ఈసంఘమున చేరగల సాధారణ మెంబరుకు సంవత్సరం ౧కి చందా రు ౧-౦-౦ ని పోషకులకు చందా సంవత్సరం ౧కి రు ౩-౦-౦లును యేర్పరుపబడినది. దేశాభిమానులొసగు సొమ్ము యెంత మొత్తమైనను సంతసపూర్వకముగా అంగీకరింపబడును. వ్యవసాయోపసోదరు లందరు ఈ సంఘమున మెంబర్లుగా చేరి దేశాభ్యుదయమునకు తోడ్పడ ప్రార్థితులు.

బి. కె. దేవయ్య,

సెక్రటరి.

సత్యమేవ జయతే
ధర్మసాధని

శనివారము, ౧౯, ఫిబ్రివరి, ౧౯౨౧.

# విశ్వభారతి.

—:(–0:0:0–)–:—

"It is a great resposibility we are taking—the carrying out of this idea of an International University where students from East and West are to meet and work together.........The past has been for men, the future is for Man. Those men are still fighting for the possession of this world—the din and the clash are deafening, the air is obscured with the dust rising from the trampled earth; standing in the heart of this struggle we have to build a seat for the one God revealed in all human races."

*Rabindranath Tagore.*

"ప్రాచ్య ఖండములనుండి, పశ్చిమ ఖండములనుండి విద్యార్థులు వచ్చి కలసి యొకచో విద్య నభ్యసించు అంతర్జాతీయ విశ్వవిద్యాలయము యొక్క ఆదర్శము కొనసాగించు గొప్ప బాధ్యత మనము వహించియున్నాము......భూతము నికృష్ట మానవుల కొరకు, భవిష్యత్తు ఉత్కృష్ట మానవసంతతి కొరకు. స్వార్థపరులు ప్రపంచమును స్వాధీనము చేసికొనుటకు ఇంకను పోరుచునేయున్నారు. ఆ కోలాహలముతో చెవులు తూట్లుపడుచున్నవి. త్రొక్కబడు భూమినుండి లేచుచున్న దుమ్ముతో వాయువు కప్పబడినది. ఈ సంగ్రామ మధ్యమున నిలచి సర్వమానవ జాతులయందు అభివ్యక్తమయిన పరమేశ్వరుని కొరకు మన మొక ఆలయము నిర్మింపవలసియున్నారము" అని రవీంద్రనాథ ఠాకూరుగారు ఇటీవల అమెరికానుండి తమ శాంతినికేతన మిత్రులకు వ్రాసిన యొక లేఖలో తెలిపిరి. శాంతినికేతనమును గూర్చి ఆంధ్రులిదివరకె వినియున్నారు. అది మహర్షి దేవేంద్రనాథ ఠాకూరుగారి తపోవనము. వారి మరణానంతరము, వారి పుత్రుడు రవీంద్రనాథ ఠాకూరుగారు అందు బ్రహ్మచర్యాశ్రమము బాలబాలికలకు విద్యాబుద్ధులు గరపు నిమిత్తము స్థాపించిరి. రెండు సంవత్సరముల క్రిందటివరకు వారికొరకొక సామాన్య విద్యాలయము మాత్రము అచట నడపబడుచుండెను. నేడది 'విశ్వభారతి' అను మహా విద్యాలయముగ మార్చబడెను. ఆ విశ్వభారతిని గూర్చియె రవీంద్రనాథ ఠాకూరుగారు తమ యాశయమును పై వాక్యములందు వెలిబుచ్చిరి. దొరతనము వారిచే నడపబడునట్టి గాని, జనులచే స్వతంత్రముగ స్థాపింపబడునట్టి గాని విద్యాలయము లే యాదర్శమనుసరింపవలెనో, విచారించు సమయ మిది. ఈ తరుణమున రవీంద్రుని యభిప్రాయము ఎల్లరు గమనించి యందలి సత్యము గ్రహించుట మంచిది.

రవీంద్రుడు, భరతవర్షము ఉత్తమ విద్యావిధానమును బడసిననె గాని అభ్యున్నతి గాంచజాలదని బాగుగ గుర్తించి కొంత కాలమునుండి తనకు మంచిదని తోచిన రీతిని విద్యాబోధనమునకు గడంగెను. తన యుద్యమమును నేడు మహోద్యమము చేసెను. తన యాదర్శమును అంతకంతకు స్పష్టతరపరచెను. ప్రపంచమునందు ఐహికముగ నెట్టి యున్నతపదవి కలిగియుండకున్నను ఆధ్యాత్మికముగ మాత్రము భరతఖండము నేటికిని సర్వోన్నతపదవి కలిగియె యున్నది. భారతవర్షము ప్రబోధించు భావములు సంకుచితములై భారతీయులకె వర్తించునవి గావు. భారతవర్షమునకు ఈసమయమున యావత్ప్రపంచమునకు నొసంగగల మహాసందేశము కలదు. ఆసందేశము సకలస్వార్థములను మించినది; భక్తి జ్ఞాన కర్మల సమానభూమిని కనపరచునది; భిన్నప్రకృతులను భిన్నశక్తులను ఏకముఖమునకు దెచ్చునది; సర్వధర్మములను సకల మహాపురుషులను సమన్వయము చేయునది; మానవకోటి కంతకును ఒక్కడే ఈశ్వరుడని చాటునది. ఈ యఖండ సత్యమును నవ భారత పితామహుడు—రామమోహనుడు—ఈయుగమున ప్రపంచమున కెల్లరకు చాటెను. దేవేంద్రనాథుడు అది తన జీవితములో విశేషరూపమున సాధించి తోడి దేశీయులకు మార్గప్రదర్శకుడయ్యెను. అతని జీవితమందలి ఆపరమ సత్యము ఆతని తపోవనమున నె—శాంతినికేతనమున—నేడు విశ్వభారతి అను విద్యాలయ రూపము దాల్చినది. దేవేంద్రుని ఆత్మజుడు—రవీంద్రుడు—అందు గురుపీఠము అధిష్ఠించెను. రవీంద్రుని ముఖమున వెలువడు సత్యము

అనేవిధిగాదు; ఆర్యావర్తము చిరకాలమునుండి చేయుచువచ్చిన తపస్సుయొక్క ఫలము.

ఏదైన బాగుండలేదని గ్రహించుట అతిసులభము. దానిని విమర్శించి ఖండించుట అంతకంటె సులభము. సత్యము తెలిసికొనుట కష్టము. దాని ననుసరించుటను గూర్చి వేరుగ చెప్పనక్కర లేదు. ప్రస్తుత విద్యావిధానము సరిగాలేదని అందరు అనుచున్నారు. ఏ కొలది మార్పులో సూచించువారును, ఏ సంకీర్ణ ఆదర్శములో తెలుపువారును, ఏ సామాన్య జీవనమునో లక్ష్యముగా చూపువారును పలువురు వారియందు గలరు. మన భరతఖండము ప్రపంచమునందు ధర్మపీఠము వహింపవలసియున్నది. అందునకు వలసిన విశాలమును ఉన్నతమునైన ప్రయత్నమును మనము పూనవలసియున్నది. ఆ కార్యము చాల భారమైనదని రవీంద్రుడె చెప్పుచున్నాడు. కాని మనము అంతకు తక్కువ ప్రయత్నము తలపెట్టగూడదు. అట్లు చేయుట దేశమునకు ద్రోహము చేయుట; మనల మనము తక్కువపరచుకొనుట. ప్రాచీప్రతీచ్యములు రెంటికిని కలియవను నొక ప్రతీతిగలదు. అది అసత్యమని మనము చూపవలెను. పారతంత్ర్యమున, ప్రత్యేకత్వమున, స్వార్థపరత్వమున కొట్టుకొను వారికి ప్రాచీప్రతీచ్య సమ్మేళన మసాధ్యముగ దోచును. అఖండత్వమున, ఏకత్వమున, ఉదారత్వమున నోలలాడు మన దేశ ఋషిసత్తములకది సుసాధ్యమె. రవీంద్రుడు ఆర్షసంతతికి చెందినవాడు. అతడు ఆదర్శ విద్యాలయమును నిర్మింపబూనెను. దాని ద్వితీయవార్షిక నివేదనము ప్రకటింపబడినది. మహాపండితులు అధ్యాపకులుగ నియమింపబడిరి. సాహిత్యము, కళలు, సంగీతము గరపబడుచున్నవి. లక్షలకొలది సొమ్ము వెచ్చింపబడుచున్నది. వివిధ ప్రాంతములనుండి విద్యార్థులు అరుదెంచిరి. చక్కని యేర్పాటులు చేయబడుచున్నవి. విశ్వభారతి యొక్క కార్యక్రమము పరిశీలించుచు అందలియుత్తమమార్గములు దేశీయులును పారతనమువారును అనుకరించుటకు యత్నింతురు గాక!

సర్వజనీన జీవనమును గ్రహించుటకు బోయి తుదకు జాతీయ జీవనమునే గోల్పోవుట యగునని కొందరు భయపడుదురు. అట్టి భయమునకు కారణము లేకపోలేదు. స్వదేశమును, స్వజాతిని గూర్చి ప్రస్తావన లేకుండ ఎంతసేపును ఆకాశమువంక జూచు అద్భుత విశ్వజనీనవాదము విశ్వజనీనత యనిన భయమునే గాక రోతను కలిగించును. రవీంద్రుడు ఆ విపరీతవాదమునకు జెందినవాడు గాడు. విశ్వజనీనత జాతీయతకొరకే, జాతి వికాసము కొరకె ఆవశ్యకమని యూహించి విధమున అతడు ఇంకొక లేఖయందు తెలిపెను.

"We must find our infinite perspective, must know that we belong to the great future and to the Universe of Man. India becomes unreal when it is merely India to us and nothing more, she is true only in the eternal humanity."

## మల్లాది సత్యలింగం నాయకర్ విద్యాలయము.

——:o:——

దీనిని గూర్చి ౧౧-౨-౨౧ తేదిన కాకినాడ మునిసిపల్ కౌన్సిలువారు ఈక్రింది తీర్మానము గావించిరి.

That as the Malladi Satyalingam Nayakar's Charities are not conducted both in the general and the industrial sections completely, in accordance with the terms of late Mr. Satyalingam Nayakar's will and the Judgment of the Subordinate Court Cocanada, in O. S. No. 10 of 1917 and as the delay in opening the industrial sections has been detrimental to the best interests of the people in these parts, this council urges upon the trustees of the said charities the imperative need of opening the third form in the general section and the various branches of the industrial section in accordance with the terms of the will and the Judgment, and of otherwise carrying out the purposes of the trust in accordance with the directions as interpreted by the Judgment in O. S. No. 10 of 1917.

సత్యలింగం నాయకరుగారి మరణశాసనమునందును, తద్విషయమై కాకినాడ సబ్ కోర్టువారు ఇచ్చిన తీర్పునందును, గల మతులను పూర్తిగ అనుసరించి విద్యాలయమున పని జరుగుటలేదు గాన, అట్లు [illegible] జరుగుటవలన జనులకు నష్టకరము గాన, మూడవఫారము వివిధ పరిశ్రామిక శాఖలను తెరచుట అత్యావశ్యకమని ట్రస్టీలకు కాకినాడ మునిసిపల్ కౌన్సిలువారు తెలుపుచున్నారు. వ్యవసాయము, నేత, కంచు ఇత్తడిసామానులు చేయుట, రంగులువేయుట, కుండలుచేయుట, పేము అల్లిక, కాలిజోళ్లు తయారుచేయుట మొదలగు చేతిపనులు, మూడవఫారము వరకు సాధారణవిద్య, నేర్పబడవలెనని జడ్జిమెంటులో నిర్ణయింపబడెను. సత్యలింగం నాయకరుగారి దానము విషయమై మునిసిపల్ కౌన్సిలు శ్రద్ధవహించుట శ్లాఘనీయము. ౭ లక్షలధనము మూలధనముగా గల విద్యాలయము మరింత ఉన్నతము నొందుటకు అవకాశము గలదు. ట్రస్టీలు వెంటనే తమ నిర్ణీత కార్యములన్నియు నిర్వహించి దేశము మన్ననకు పాత్రులగుదురు గాక!

# అగ్రిజాతుల వారికి

అంత్యజాతుల దీనాలాపము.

—o—

సీ. శర్మలారా! మిమ్ము శరణుజొచ్చిన మమ్ము
దయజూడకుండుట ధర్మమగునె?
వర్మలారా! మీరు వజ్జజేరిన మమ్ము
గావకుండుట మీకు కర్మమేమొ?
గుప్తులారా! మిమ్ము నాప్తులనుచు లోన
దలచుమమ్ముల విడదగునె? యిటుల
కాపులారా! పాలి కాపులమగుమమ్ము
బిక్కల బెట్టుట శ్రేయమగునె?
ప్రముఖవరులారా! యికనైన సుముఖులరయి
దీనజాతీయులను తోడిదేశజులను
నైన మమ్ముద్ధరింపంగ బూనరయ్య
దీనికంటెను సత్కార్య మేమిగలదు?

సీ. శ్వేతజాతులు కృష్ణజాతుల ద్వేషింప
జూచి సైపగలేని సుగుణులారా!
పాలక పాలిత భావంబు తప్పించు
జక్కట్లు చెప్పెడి సరసులార!
ప్రాచ్యపాశ్చాత్య భూప్రజలెల్ల సములని
వాగ్వాదములు సేయు వక్తలార!
ఇతరుల కొరకు బరమతసహిష్ణుత నేర్వ
బూనుకొన్నట్టి యో పుణ్యులార!
ఒక్క సంతతిలో జేరి యొక్కమతను
ఒక్క దేశమువారమై యున్నమమ్ము
హీనులనియెంచు నిర్దయ యేలకలిగె
మాతృదేశజులార! యో మాన్యులార.

సీ. మమ్ము మీతోబాటు ప్రభుల కర్పించియు
వారు త్రవ్విన నూయి వాడదగదె?
శిస్తు మీతోబాటు చెల్లించియును, వారు
నిర్మించు బడివిద్య నేర్వరాదె?
సాధారణపుకిస్తు సర్వమిచ్చియు వారు
నిల్పు సత్రంబులో నిల్వదగదె?
ఆశ్వాసుమెంటుల నన్నిగట్టియు వారు
కట్టించు శాలల ముట్టరాదె?
మెచ్చుపన్ను, రైల్వే సెస్సు పిసపరోడ్డు
పన్నులెల్ల మీతోబాటు ప్రభుల కొసగి
త్రోవలను బాటలను మీకు దొలగవలెనె?
మీరలున్న స్టీమరు మేము జేరరాదె?
మీరువెళ్ళు పడ్వను మేము గోరదగదె?
ఏమిధర్మమ్ము? చేయంగ నిట్టిపనులు.

సీ. భరతవాసులమమ్ము దరిజేర రానీక
పై దేశములనున్న వారికొఱకు
మాతృదేశమునందు మా పాక్కలీయక
పరదేశములనున్న వారికొఱకు
స్వంతదేశమ్ముల వారి సంగతిమర్చి
మారీసులోనున్న వారికొఱకు
స్వీయదేశజుల మా స్వేచ్ఛనపహరించి
బ్రహ్మదేశములోని వారికొఱకు
పోరుసల్పుటయన మీకు బోధపడునె?
వనపు కొమ్మొరులకిడని వర్తనంబు
ఊరిసొత్తంత ధార పోయుటయె గాదె?
గెల్చి సుంకింట రచ్చను గెలువరాదె?
గాన మమ్ముద్ధరింపంగ బూనరయ్య.

జి. జె. సామ్యుల్.

---

# నీవు నిజముగ హిందువైనచో దీనిని తప్పక చదువుము.

—o—

దేశము నుద్ధరింపు తలంపుగలవాడవై నియ్యది శ్రద్ధతో నాచరింపుము.

భూమండలమున పుణ్యభూమి, హిందూ దేశము. ఈ దేశములో నివసించువారు, హిందువులు. అందులో ప్రథమనివాసులగు మాల, మాదిగ, కోయ, చెంచు, భిల్లు, ఎఱుక, మొదలగు, నంత్యజులని నీతో పిలువబడువారందరు, ఆది హిందువులు (ఆదిమ నివాసులు).

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులలో నున్న భేదములు వారిలోను గలవు.

హిందూ, మహమ్మదీయ, పార్సీ, యూదులు, నెట్లు ప్రత్యేక జాతివారో, నట్లే వారును నొక ప్రత్యేక జాతివారు.

తమ్ము జయించిన హిందువులతో దీర్ఘకాల సంబంధమువలన విశేషముగ హిందూ ఆచారములనే పాలింతురు. నిజముగ విచారించినచో వారి జాతిధర్మములు, ఆచారములు వేరు. దేశము నాక్రమించినవారి ననుసరించిన శూద్ర మహాశయులు, పూర్వము ఆది హిందూజాతిని వదలిన స్వదేశసోదరులు.

ఆది హిందువులు ఆర్యులు రాకపూర్వము నీ దేశమును పాలించిన ప్రజలు, గాన గౌరవముగల ప్రతి హిందూసోదరుడు వాడుకలోనున్న నీచ నామములను వాడక, ఆది హిందువులని, పిలిచినచో, కేవలము వారిని సన్మానించుటయని భావించక మన పుణ్య మాతృదేశమును గౌరవించిన వారలగుదురని, నమ్మవలయును. ఈ నవయుగమున ప్రతివిషయమును శోధించుటయును, నట్లాచరించుటయును, ప్రతిభారతీయుని పరమవిధి.

యొ. బి — ఆది హిందూసోదరులు తమపూర్వోన్నత స్థితిని జ్ఞాపకముంచుకొని తమ యభివృద్ధికొరకై నిరంతరము పాటుబడుదురుగాక.

భాగ్యరెడ్డి వర్మ,
మంత్రి ఆదిహిందూమహాజనసమితి,
రసిడెన్సి దక్షిణ హైదరాబాదు,

---

**The Dharma Sadhani Press,**

COCANADA.

*All Kinds of Job work*

*in*

**English & Telugu**

*Promptly and Neatly*

*executed.*

---

**CHEAPEST HOUSE**

**For School Books and Stationery etc.,**

# READY FOR SALE.

**S. S. L. C. Public Examination 1921.**

(1) Selections in English Prose & Poetry FOR DETAILED STUDY Complete Book Price Rs. 0-10-0.

(2) S, S. L. C. Telugu Text Book For A. and C. Group. For Detailed Study Price Rs. 1-0-0.

—::—

**S. S. L. C. Public Examination 1922.**

English Non-detailed Text Books. Anounced in advance to be used for V Form, in the Year 1920—21.

(1) Parables from Nature by Margaret Gatty. 0-12-0

(2) Settlers in Canada by Captain Marryat. 0-11-0.

**T. P. VENKAYYA,**

**Book-Seller etc.,**

*COCANADA.*

## కేసరి—కస్తూరియము.

## లోధ్ర.

గర్భాశయము రోగనివారిణి.

స్త్రీలకు కలుగు ఋతుదోషములు, బహిష్టు కానందుట, అకాల బహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, కుసుమరోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, సూతికా వాతము, కీళ్ళ నొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసుస్త్ర వ్యాధులను కుదుర్చును. 24. డో రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

## అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి ముఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సులు రు. 5. 12అవున్సులు బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0

## అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసమస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ మహాశ్చర్యముగ కుదుర్చును. 6 అ రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేధ ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.

---

# P. SUBBA ROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజావూరు.

26. సుగంధ ముక్కుపొడి — ఈ ముక్కుపొడి మేలయిన వాసన ద్రవ్యములచేర్చి సువాసనతో గూడినది. ఒక మనిషి ఒక దినమునకు యెంత ముక్కుపొడి నుపయోగించునో అంత పొగాకు పొడిలో ఈసువాసన పొడిలోని ఒక చిటికెడు చేర్చినయెడల పొడియంతయు మిక్కిలి వాసనతో గూడినదియగును. ప్రత్యేకముగా నుపయోగించవలసినది లేదు. ఈసుగంధపొడిలో కలిపిన ముక్కుపొడి అనేక దినములవరకు సత్తువచెడక యుండును. తలనొప్పి, పీనసము, జలుబు, ముక్కునుంచి నీరు కారడము, కపాలనొప్పి, ముక్కునందలికంపు, మయికము మొదలయినవి తీరును. దీనిలో నవాచారము చేసి, సాధారణముగా నస్యము నుపయోగించుటచే కలుగు దుర్గంధమును పోగొట్టి సువాసన కలుగజేయుటయే గాక ముక్కునందలి యే సువాసన చుట్టుకొనియుండును. పొడివేయు అభ్యాసమును క్రమేణ పోగొట్టును.

ఒక సీసాయందలి ముక్కుపొడి ఒక నెలకు చాలును. సీసా ఒకటికి వెల అణాలు 4, 1 టి మొదలు 3 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 8, 4 మొదలు 6 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 5, 7 మొదలు 12 సీసాలవరకు వి. పి. శెలవు 7 అణాలు ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి, చార్జి 7 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్త క్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0  వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనే వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0; పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫోర్టురోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత
డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము..

55, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయించబడును. ప్లేగు, కలరా, ఇన్ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును. ఇతర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధి వివరములను వ్రాసిన, మందులు సిద్ధపరచి యుంచి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

డా. మాధవ మేనేజరు (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము ‖ డి. దేశికాచార్యులు,
పండిట్, మదరాసు. ‖ జాయింటు ప్రొప్రయిటర్.


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానే చెల్లింపవలెను.


**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


V. P. Rs.

To M. R. Ry.

61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.